క్లుప్తంగా

సీసీ డ్రైయిన్ ఏర్పాటు చేయాలి

కావల్లాపురం: మండల కేంద్రం కావల్లాపురం బీసీ కాలనీ (వడియ రాజుల కాలనీ)లో మురుగు కాల్వ లేక కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం నీరు ఇళ్లలోకి చేరడంతో ఆగచాట్లు పడుతున్నారు. కాలనీలో మురుగుకాల్వ ఏర్పాటు చేయాలని పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి దృష్టికి తీసుకొని వెళ్లామని అలాగే పలుమార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని కాలనీ వాసి వేముల కోటినారాయణ వాపోయారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు స్పందించి కాలనీలో సీసీ డ్రైయిన్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉపాధి హామీ నిధులను సద్వినియోగించుకోండి



బొల్లాపల్లి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావులాపురం, గండిగనుమల గ్రామాల్లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సీసీ రోడ్లకు మంగళవారం భూమి పూజ నిర్వహించారు. రావులాపురం గ్రామంలో రూ.10 లక్షల సీసీ రోడ్డు, రూ.2.30 లక్షల విలువ చేసే గోకులం షెడ్డు, గండిగనుమల గ్రామంలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైయిన్, రెండు గోకులం షెడ్లకు ఉపాధి హామీ పథకంలో మంజూరైన వాటికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఈపూరు టీడీపీ సుధాకర్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో షేక్ జిలానీ బాషా, మండలస్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు కేబీఆర్ విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు కేబీ ఆర్ కళాశాల విద్యార్థి పి.నరేంద్ర ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.వి. నాగిరెడ్డి మంగళవారం తెలిపారు. రాజమండ్రిలో నిర్వహించిన అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలో నరేంద్ర 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్ పోటీలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. మరో విద్యార్థి డి.ఉదయ్ జావలిన్ త్రో పోటీలో కాంస్య పతకం సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.వెంకట శివ, పీడీ ఎం.వి నీల్ అభినందించారు.

మున్సిపల్ కార్మికులకు యూనిఫాం పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా 200 మంది కార్మికులకు ఈ యూనిఫాం ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ సభ్యులు సమాజ అభివృద్ధి కోసం వారు చేస్తున్న స్వచ్ఛంద కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ జి. శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీ ఏదుడ వెంకటనారాయణ, ట్రెజరర్ ఎస్‌కే మస్తాన్, మాజీ ప్రెసిడెంట్లు ముత్తినేని గిరిబాబు, చిరుమామిళ్ల కోటేశ్వరరావు, అలా శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, సాధినేని శ్రీనివాసరావు, జి. నాగరాజు, పెనుగొండ రాజేష్, మాదాల హనుమంతరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం బొల్లాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.శంకరనారాయణ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో జ్వరాలు, వాంతులు, విరేచనాల వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని, మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. వర్షాలు కురవడం వల్ల మురుగు చేరి దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.

ఎండు తెగులు నివారణకు పిచికారీ చేయండి

రొంపిచర్ల: మండలంలోని అన్నవరం, తుంగపాడు గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిపైరులో ఎండు తెగులు ఆశిస్తుందని, కాంటాప్ మందును పిచికారీ చేయాలని ఏవీవీ మస్తానమ్మ సూచించారు. ఈ పైరుకు పైపాటుగా పొటాష్ ఎరువును వాడి మొక్కలో రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు, జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బందితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

మాలధారణం – నియమాల తోరణం

- గణపవరంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప దీక్షాధారణ
- ఏటేటా పెరుగుతున్న హరిహరసుతుని మాలాధారులు
- గణపవరం సేవా సంఘం ఆధ్వర్యంలో స్వాములకు విశిష్ట సేవలు



గణపవరంలో అయ్యప్ప దీక్షాధారులకు సద్ది ఏర్పాటులో గణపవరం అయ్యప్ప సేవా సంఘం సభ్యులు

నాదెండ్ల: ఇరుముడి కట్టి... శబరిమల ఎక్కి.. నెయ్యి అభిషేకం.. మణికంఠుడికి ఆలా రెండు దశాబ్దాలుగా హరిహరసుతుడికి భక్తుల కఠోర దీక్షాధారులై తమభక్తిని చాటుతున్నారు. స్వామియే శరణమయ్యప్ప.. శరణం అయ్యప్ప అంటూ నలభై ఐదు రోజుల దీక్షలతో తరిస్తున్నారు. సెప్టెంబర్ నెలలో మాలధరించే వారు శబరిమలలో మెట్ల పూజకు వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. డిసెంబర్ నెలలో దీక్ష తీసుకునే వారు జనవరి మాసంలో మకర జ్యోతి దర్శనం చేసుకుంటారు. మేజర్ పంచాయతీ గణపవరంలో ప్రతి ఏటా వందల మంది భక్తులు అయ్యప్ప మాలధారణ గావిస్తున్నారు. గణపవరం అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన ఆలయాలైన శివనాగేంద్రస్వామి ఆలయం, శాంతిన గర్ కోదండ రామాలయం, సోమేశ్వర స్వామి ఆలయం, అంకమ్మతల్లి దేవాలయం, సంతాన వేణు గోపాలస్వామి ఆలయాల్లో పీఠాలు ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ సుమారు రెండు వందల మందికి పైగా భక్తులు అయ్యప్ప మాలధారణ చేశారు. ఐదు మండపాల్లో పడి పూజలు చేస్తూ వీరు 45 రోజుల పాటు కఠిన దీక్షలు పాటించనున్నారు. దీక్షాధారులు ఈ నెల 29న బయలుదేరి దీపావళి రోజున శబరిమలకు చేరుకుని స్వామి వారి దర్శనం చేసుకోనున్నారు. భక్తుల్లో కొందరు శబరిమల రైలుకు ముందుగానే టిక్కెట్లు రిజర్వ్ చేసుకుంటారు. మరికొందరు ప్రత్యేక బస్సుల్లో వెళ్లి వస్తారు.

ఆరుపర్యాయాల మాలధారణలో గురుస్వామి హోదా...

వరుసగా ఆరేళ్ల పాటు అయ్యప్ప మాలధారణ పూర్తి చేసిన వారు గురుస్వామి హోదాను పొందుతారు. అదే పద్దెనిమిది సార్లు మాలధారణ గావించిన వారు పెద్ద గురుస్వామి హోదాను పొందుతారు. పెద్ద గురుస్వామే దీక్షాధారులకు మాలధారణ గావిస్తారు. గణపవరం గ్రామంలో వజ్జ బ్రహ్మయ్య, కాట్రు రమేష్, మాదినేని చంద్రమౌళి, కాటా శ్రీనివాసరావులు పెద్దగురుస్వామి హోదాను పొందారు. వీరి ఆధ్వర్యంలో గ్రామంలో ఐదు పీఠాలు ఏర్పాటు చేసి నిత్య పూజలు నిర్వహిస్తారు. గ్రామంలోని దాతలు, స్థానికుల సహకారంతో దీక్షాధారులకు బిక్ష, సద్ది సమకూరుస్తున్నారు. గణపవరంలో నిర్వహిస్తున్న అయ్యప్ప మాలాధారణ, పడిపూజలు, సద్ది ఏర్పాట్లు ఇతర గ్రామాల్లోని భక్తులకు సైతం ఆదర్శంగా నిలుస్తోంది.

దేవాలయ నిర్మాణానికి ప్రణాళికలు



60 ఏళ్లుగా క్రమంతప్పకుండా అయ్యప్ప దీక్ష తీసుకుంటున్నా. శబరిమల వెళ్లి స్వామిని దర్శించుకుంటున్నా. ప్రస్తుతం గణపవరంలో గురుస్వామిగా వ్యవహరిస్తున్నా. గ్రామంలో ఐదు పీఠాల ఆధ్వర్యంలో నిత్యం పూజలు జరుగుతాయి. గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు వేస్తున్నాం. దాతలు, స్వామి భక్తుల సహకారంతో త్వరలో ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాలి.

–వజ్జ బ్రహ్మయ్య, పెద్దగురుస్వామి

దీక్షాధారులకు బిక్ష, సద్ది



గ్రామంలో సుమారు 400 మంది భక్తులు ప్రతి ఏటా అయ్యప్ప మాల స్వీకరిస్తారు. గణపవరం అయ్యప్పసేవా సంఘం ఆధ్వర్యంలో స్వాములకు ప్రతి రోజూ సాయంత్రం బిక్ష ఏర్పాటు చేస్తున్నాం. గ్రామంలోని దాతలు, అయ్యప్ప భక్తులు ఉదారంగా సరుకులు, నగదు సాయం చేస్తున్నారు. వీరి సహకారంతో కేవలం అయ్యప్ప భక్తులే కాకుండా దుర్గామాల, శివమాల దారులు సద్దికి వస్తుంటారు. వచ్చిన స్వాములందరికీ లేదనకుండా బిక్ష అందిస్తాం.

–కాట్రు రమేష్, గురుస్వామి

దీక్షాధారులు పెరుగుతున్నారు



నేను 20 ఏళ్లుగా అయ్యప్ప దీక్ష ధరిస్తున్నా. భక్తి శ్రద్ధలతో కఠోర దీక్ష పూర్తి చేస్తున్నా. ప్రతి ఏటా శబరిమలలో స్వామి వారిని దర్శించుకోవటం ఎంతో సంతోషంగా ఉంది. మెట్ల పూజకు లేదా మకరజ్యోతి దర్శనానికి వెళ్తుంటాను. గ్రామంలో ఏటేటా అయ్యప్ప మాల ధరించే స్వాముల సంఖ్య పెరుగుతుండటం సంతోషమైన విషయం.

–మాదినేని చంద్రమౌళి, గురుస్వామి

మిరప రైతులు.. జాగ్రత్తలు తీసుకోండి



వినుకొండ(నూజెండ్ల): ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు మిరప పంటలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వినుకొండ ఉద్యాన అధికారి షేక్ నబీ రసూల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరకెత్తిన పొలాల్లో మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాముల యూరియా 10 గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. మొక్కలు వడలడి, తలలు వాల్చినట్లయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. జనుము దాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనబడితే పది లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేదితో పాటు ఒక నిమ్మ చెక్కరసం కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కాపుతో ఉండి వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదళ్లు చుట్టూ మట్టిని ఎగదోయాలన్నారు.

నేల ఆరుకుని వరిపైన వెంటనే గొర్రు వేసి అంతర కృషి చేసినట్లయితే వెంటనే ఆరుతుందని వివరించారు. పైపాటుగా ఎకరానికి అదనంగా 30 కిలోల యూరియా 15 కిలోల పొటాష్, 200 కిలోల వేపపిండి వేయాలన్నారు. బ్యాక్టీరియా, ఆకుమచ్చ, కోనోపోర తెగుళ్లు, వేరుకుళ్లు, కాయకుళ్లు, కొమ్మ ఎండు తెగుళ్ల నివారణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే రైతు సేవా కేంద్రాల్లోని ఉద్యాన సహాయకులను సంప్రదించాలని సూచించారు.

సమయపాలన ముఖ్యం



సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలి. ప్రజలకు అవసరమైన వివిధ రకాల సచివాలయ సర్వీసుల గురించి సిబ్బందికి అవగాహన కల్పించాలని జిల్లా డీఎల్ డీవో వెంకటరెడ్డి. ఈపూరు మండలంలోని ఇనుమెళ్ల గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది రికార్డులను పరిశీలించారు.

–ఈపూరు

పంటకు సస్యరక్షణ అవసరం



వరి పైరులో ఆగితెగులు,ఆకుముడత పురుగు తెగుళ్ళ నివారణకు రైతులు తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ కార్యాలయం డీడీఏ మద్దినేని శివకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని గుంటుపాలెం, వయ్యకల్లు గ్రామాల్లో వరి పంట పొలాను సాగు చేసే రైతులతో అవగాహన కార్యక్రమాలతో పాటు పొలం పిలుస్తోంది వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఏరువాక శాస్త్రవేత్త వెంకట రాములు,ఏడీఏ పురేటి అశోక్, ఏవో అదాం, రైతులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

–కావల్లాపురం

చేతుల పరిశుభ్రత దినం



గ్లోబల్ హ్యాండ్ వాష్ డే (ప్రపంచ చేతుల పరిశుభ్రత డే) సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో పి.వృఆరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, చేతులను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని వివరించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయడం జరిగింది. చేతులు పరిశుభ్రం చేసుకోవడానికి 7 స్టెప్పులను సీహెచ్‌వో రూఫ్ని లక్ష్మీ ప్రాక్టికల్‌గా వివరించారు.

–వినుకొండ(నూజెండ్ల)

శభాష్ ఏసుమరియమ్మ



రాష్ట్రస్థాయి యోగ పోటీల్లో తిరుమల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ మంగళవారం తెలిపారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో కళాశాల విద్యార్థిని పి.ఏసు మరియమ్మ ట్రెడిషనల్ యోగ విభాగంలో తృతీయస్థానం సాధించినట్లు తెలిపారు. ఏసుమరియమ్మతో పాటు యోగా ట్రైనర్ రంగలక్ష్మిని ప్రిన్సిపల్ అభినందించారు.

–నరసరావుపేట రూరల్

ఇదిగో.. విగ్రహం ఏర్పాటు చేసేస్తున్నాం!

- తెలుగు తల్లి విగ్రహాన్ని గాంధీ పార్కులో ప్రతిష్టిస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు
- సాక్షి కథనానికి స్పందించి దిమ్మె నిర్మాణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



గాంధీపార్కులో విగ్రహ దిమ్మె నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

సాక్షి ఎఫెక్ట్

నరసరావుపేట: తెలుగుతల్లి విగ్రహాన్ని గాంధీపార్కులో ఏర్పాటు చేస్తున్నామని, ఈ విషయంలో ఎటువంటి అపోహలకు తావీయవద్దని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఉన్న స్థలం నుంచి తెలుగుతల్లి విగ్రహాన్ని తరలించటంపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే మంగళవారం ఉదయం గాంధీపార్కులో విగ్రహ ఏర్పాట్లను పరిశీలించారు. త్వరగా విగ్రహ దిమ్మె నిర్మాణ పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో దిమ్మె నిర్మాణం అనంతరం తెలుగుతల్లి విగ్రహాన్ని అభివృద్ధి చేసి దశలవారీగా పేర్కొన్నారు. మా ప్రభుత్వం హయాంలోనే తెలుగు తల్లికి న్యాయం చేస్తున్నామని, సమున్నత స్థానంలో ప్రజలు పూజించుకునే విధంగా గాంధీ పార్కులో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

గాంధీ పార్కులో ఏర్పాటు చేసి సుందరవనంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ అధికారులను కోరామని చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు. ఇదిలా ఉండగా విగ్రహాన్ని తొలగించిన స్థలాన్ని ఏం చేయబోతున్నారో చెప్పకపోవటం గమనార్హం.

ఆదర్శనీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం

- నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ఘనంగా జయంతి నిర్వహించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు



ఎన్ఈసీలో అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కళాశాల చైర్మన్ కోటేశ్వరరావు



ఏఎంరెడ్డి కళాశాలలో అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

నరసరావుపేట: భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలాం 94వ జయంతిని పురస్కరించుకుని పార్టీ శ్రేణులతో కలిసి పల్నాడు రోడ్డులోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఏడాది జిల్లా ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు ఘనంగా నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కలాం గొప్ప మేధావి, భారతదేశానికి అమూల్యమైన సేవలు అందించిన గొప్ప క్షిపణి శాస్త్రవేత్తని కొనియాడారు. ఆయన చిన్నస్థాయి నుంచి రాష్ట్రపతి స్థాయికి కేవలం తన తెలివితేటలు, మేధాశక్తితో ఎదిగారని, రాజకీయంగా, ఆర్థికంగా ఎటువంటి అండదండలు లేకపోయినప్పటికీ కేవలం ఉన్నత చదువులు చదువుకుని భారతదేశానికి క్షిపణి పరిజ్ఞానాన్ని అందించిన మహా మేధావి, మిస్సైల్ మ్యాన్‌గా పేరుగడించారన్నారు. ఆయన ఈనాటి యువతరానికి స్ఫూర్తి కావాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల పాల్గొని ఘనంగా నివాళులు అర్పించిన పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ సీనియర్ నాయకులు భూజాపతి మాస్టర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా, నాయకులు గండిసాటి గాబ్రియల్, అర్వి శివకోటి, షేక్ షమ్మీర్, సయ్యద్ ఖాదర్ బాషా, సయ్యద్ ఖాజా, గోస్, సయ్యద్ జాఫర్, ముద్దా కరిముల్లా, అల్లా బక్షు, ఇమామ్‌బాషా, పంగులూరి విజయకుమార్, తురక నాగుల్ మీరా, బహదూర్, కే.ప్రసాద్, కే. చిన్న వెంకటేశ్వర్లు, యువజన విభాగం జిల్లా కార్యదర్శి బూదల కళ్యాణ్, వైఎస్సార్ యూత్ శివరాత్రి ఆళ్ళ, ఎస్సీ జిల్లా విభాగం నాయకులు చిన్నబాబు, తంగిరాల రాజారెడ్డి, రుక్మిణీబాబు, బాలరాజు, ఎంఎంఎ పార్టీ నాయకులు షేక్ మౌలాలి, షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

వివిధ కళాశాలల్లో...

నరసరావుపేట రూరల్: మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం 93వ జయంతిని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాలలోని అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అబ్దుల్‌కలాంను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.మల్లికార్జున, డిప్లొమా ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం

చిలకలూరిపేట: స్ఫూర్తి ప్రదాత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం అని పలువురు ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని రైతుబజార్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బీ శ్రీనివాసరావు, బి వెంకటేశ్వర్లు, ఎస్ నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, కొండముద్ద నాగేశ్వరరావు, ఎస్ నాగరాజు, ఎం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో

నరసరావుపేట: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఉపాధ్యక్షులు జి.ఆదినారాయణ సుధాకర్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అతని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సీతారామకృష్ణ, ప్రసాద్, రవికిషోర్, సత్యం, కాజా పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యానికి పునాది

చిలకలూరిపేట: చేతుల పరిశుభ్రత ఆరోగ్యానికి పునాది వంటిదని ఎంపీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.సుభద్ర చెప్పారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రతదినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. చేతులు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా శరీరంలో సులభంగా వ్యాధులు చేరకుండా నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్త ఎస్ రాజేశ్వరి విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకొనే విధానాన్ని చేసి చూపించారు. ఉపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు, ఎ సిలిమ, ఎస్ అంజమ్మ పాల్గొన్నారు.

హ్యాండ్ వాష్ డే

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ హ్యాండ్ వాష్ డేని మంగళవారం నిర్వహించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థినీ, విద్యార్థులకు హ్యాండ్ వాష్ ప్రాముఖ్యతను వివరించారు. భోజనానికి ముందు చేతులు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు తోటి వారికి పరిశుభ్రతపై అవగాహన కలిగించాలన్నారు. హెచ్ఎం సుజాత, వ్యాయామ ఉపాధ్యాయుడు సైదయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తినడానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి

బొల్లాపల్లి: భోజనానికి ముందు ప్రతిఒక్కరూ చేతులు శుభ్రపరచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. శ్రీదేవి తెలిపారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత గురించి, చేతుల పరిశుభ్రపరచుకోవడం గురించి మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. గండిగనుమల, రావులాపురం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ చేతుల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు, చిన్నారులకు చేతులు శుభ్రపరుచుకునే విధానం గురించి వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

కొనసాగిన వర్షాలు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం కూడా వర్షాలు కొనసాగాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం ఉదయానికి 19.0 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్టు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. మధ్యాహ్నం వరకు వర్షం కురుస్తూ ఉండగా ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి వర్షం ఆగింది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఓ మోస్తరు ఎండలు కాశాయి.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

చిలకలూరిపేట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలబడి పారిశుద్ధ్యానికి అంతరాయంగా మారింది. ఈ నేపథ్యంలో మంగళవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు పలు ప్రాంతాలలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

చెంఘీజ్‌ఖాన్‌లో పల్లె పండుగ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల: యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేటలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండవీడు మేజర్ కాలువ పరిధిలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కొండవీడు మేజర్ కాలువలో తీత పేరుకుపోవడం వలన కొన్ని బొట్ల లీకేజీలతో పొలాలకు సక్రమంగా సాగునీరు అందటం లేదని, నీరు వృధాగా పోతున్నాయని రైతులు వివరించారు. ఫలితంగా వందలాది ఎకరాలకు సాగునీరు అందటం లేదన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో...

రొంపిచర్ల: గ్రామాలు అభివృద్ధి బాటలో పయనింపచేయటమే పల్లె పండుగ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని అన్నవరం, రొంపిచర్ల, కొనకంచివారిపాలెం, గోగులపాడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో నాయకులు గోనుగుంట్ల కోటేశ్వరావు, పులుకూరి జగ్గయ్య, శాకమూరి రామారావు, వడ్డమూడి కిశోర్, శివరామయ్య, మెండితోక రామారావు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి సూచన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: కృష్ణా–గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ ఎన్నికల ఓటర్ల నమోదు అంశంపై మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నాయకులు, వార్డు ఇన్‌ఛార్జీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారితో చర్చించి త్వరితగతిన ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచనలు చేశారు.